విశాలాంధ్ర విశాఖపట్నం
బుధవారం 10, సెప్టెంబర్ 2025
పేజి నెం. 6

సమాచార శాఖ డీడీగా దున్న రమేష్‌కు పదోన్నతి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సమాచార పౌర సంబంధాల శాఖ, విశాఖపట్టణంలోని ఎస్.ఐ.సి. (స్టేట్ ఇన్ఫర్మేషన్ సెంటర్) ఏడీగా పని చేస్తున్న దున్న రమేష్‌కు డీడీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ(పొలిటికల్) ముకేశ్ కుమార్ మీనా మంగళవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం ఏడీగా పని చేసిన రమేష్ జూన్ మాసంలో జరిగిన సాధారణ బదిలీల్లో విశాఖ లోని ఎస్.ఐ.సి.కి వచ్చి, సుమారు మూడు నెలల పాటు సేవలందించారు. తాజాగా జరిగిన డీపీసీలో రాష్ట్ర వ్యాప్తంగా ఆరుగురు ఏడీలు పదోన్నతి పొందగా అందులో జోన్ -1 నుంచి పి. వెంకటరాజు గౌడ్, ఎల్. రమేశ్ లతో పాటు దున్న రమేష్ ఉన్నారు. డి.రమేష్ విజయవాడలోని డైరెక్టరేట్ కార్యాల యంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈయనకు పదోన్నతి రావటంపై సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది, అతని సన్నిహితులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త కోణంలో వార్తలను అందించాలి

- నిత్యం అధ్యయనం చేస్తూ కొత్త విషయాలు వెలుగులోకి తేవాలి
- విశాలాంధ్ర ఒక పత్రిక మాత్రమే కాదు ఒక ఉద్యమం
- ఉత్తరాంధ్రలోని విశాలాంధ్ర విలేకరుల శిక్షణా శిబిరంలో వక్తలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్ర యూనివర్సిటీలోని ప్లాటినం జూబ్లీ హాల్లో ఉత్తరాంధ్రలోని విశాలాంధ్ర విలేకరులకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న "విలేకరుల వృత్తి నైపుణ్య శిక్షణ" తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్ బాబు అధ్యక్షతన నిర్వహిస్తున్న మొదటిరోజు శిక్షణా తరగతులకు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేకరులు కొత్త కోణంలో సమాజానికి వార్తలను అందించాలని, మానవీయ కోణాల్లో కథనాలను రాయాలని సూచించారు. విలేకరులు ఏ పని చేసినా తమ కర్తవ్యాన్ని మరువరాదని, కుటుంబాన్ని చూసుకుంటూ సమాజానికి ఉపయోగపడాలని సూచించారు. క్రైమ్ వార్తల గురించి వివరిస్తూ ఫాలో వార్తలు చాలా ప్రధానమన్నారు. వారానికి ఒక రివ్యూ వార్త తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. లీగల్ విషయాల్లో జాగ్రత్త వహిస్తూ, సంఘటనల పూర్వాపరాలు తెలుసుకొని వివరాలు అందించాలన్నారు. ప్రత్యేక కథనాలు రాసేటప్పుడు పరిశోధనాత్మక మానవీయ కోణంలో రాయాలన్నారు. రాజకీయ అవగాహన కలిగి, చట్టాల అమలు తీరు మీద రాజకీయ వార్తలు ఉండాలని వివరించారు

నిత్య అధ్యయనంతో కొత్త విషయాలు వెలుగులోకి తేవాలి: హరినాధ రెడ్డి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, విశాలాంధ్ర జనరల్ మేనేజర్ హరినాధ రెడ్డి మాట్లాడుతూ నిత్యం అధ్యయనం చేస్తూ కొత్త విషయాలను వెలుగులోకి తేవాలన్నారు. మారుతున్న సాంకేతిక తలకు అనుగుణంగా వార్తలలో మార్పులు రావాలన్నారు. ప్రభుత్వాలకు ప్రజలకు పత్రికలు వారధిగా నిలవాలని పేర్కొన్నారు. విశాలాంధ్ర జర్నలిస్టులకు శిక్షణ కేంద్రంగా ఉండేదని తెలియజేశారు. అనేకమంది విశాలాంధ్ర నుంచి వెళ్లి ఇతర పత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారని తెలియజేశారు. ప్రజలకు, సమాజానికి విశాలాంధ్ర అవసరం ఎంతైనా ఉందని నొక్కి చెప్పారు. సమాజ మార్పు కోసం విశాలాంధ్ర నిరంతరం పాటుపడుతోందన్నారు. త్వరలో ఏఐ టెక్నాలజీ గురించి విలేకరులకు ప్రత్యేక శిక్షణలు అందిస్తామని వెల్లడించారు.

నైపుణ్యాలను పెంచుకోవాలి: కూన అజయ్ బాబు

విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్ బాబు మాట్లాడుతూ నైపుణ్యాలను పెంచుకుంటూ విలేకరులు ముందుకి సాగాలన్నారు. ఈద్పుగంటి నాగేశ్వరరావు, రాఘవాచారి వంటి నాటి తరం ఉన్నత జర్నలిస్టుల సారథ్యం నుంచి నాటి తరం నుంచి నేటి తరానికి వారధిగా నిలిచిన ఆర్.వి.రామారావు సంపాదకీయంలో సమాజానికి నిష్పాక్షిక వార్తలను అందిస్తూ విశాలాంధ్రను నడిపించుకుంటూ వచ్చారని తెలియజేసారు.

విశాలాంధ్ర పత్రిక మాత్రమే కాదు ఉద్యమం: నల్లి ధర్మారావు

సీనియర్ జర్నలిస్టు, కవి, సాహితీవేత్త, ఐజేయు నాయకులు నల్లి ధర్మారావు మాట్లాడుతూ విశాలాంధ్ర ఒక పత్రిక మాత్రమే కాదని ఒక ఉద్యమంగా పనిచేస్తుందన్నారు. "విశాలాంధ్రలో ప్రజాశక్తి" అనే కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నినాదంతో విశాలాంధ్ర పత్రిక ఏర్పడిందన్నారు. ప్రముఖ సాహిత్య వేత్త తాపీ ధర్మారావు చేతుల మీదుగా విశాలాంధ్ర ప్రారంభం జరిగిందన్నారు. ఈ పత్రిక స్థాపన ఒక చారిత్రక ఘట్టం అని వ్యాఖ్యానించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికగా విశాలాంధ్ర: క్షేత్ర పాల్ రెడ్డి

సీపీఐ జిల్లా ప్రతినిధి క్షేత్రపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికగా విశాలాంధ్ర రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. కమ్యూనిస్టు ఉద్యమం

ఉన్నంతవరకు విశాలాంధ్ర ఉంటుందని స్పష్టం చేశారు. శిక్షణ శిబిరంలో ప్రజా గాయకుడు దేవిశ్రీ ఆలపించిన గీతాలు పలువుర్ని ఆకట్టుకున్నాయి. విశాలాంధ్ర ఎడిషన్ మేనేజర్ సనపల నరసింహులు వందన సమర్పణ గావించారు. శిక్షణ తరగతులకు విశాఖ బ్యూరో పి. రామకృష్ణ, అల్లూరి సీతారామరాజు జిల్లా బ్యూరో డి.ఎర్రయ్య రెడ్డి, అనకాపల్లి జిల్లా బ్యూరో కొండలరావు, శ్రీకాకుళం జిల్లా బ్యూరో సనపల రమేష్ ఆధ్వర్యంలోని ఆరు జిల్లాల విశాలాంధ్ర విలేకరులు హాజరయ్యారు. ఏపీడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు, విశాలాంధ్ర జీఎం హరినాథ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అజయ్ బాబులను విశాలాంధ్ర విశాఖ విలేకరుల బృందం ఘనంగా సత్కరించింది.

అరకు కాఫీ బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచ వ్యాప్తం చేస్తాం

మంత్రి గుమ్మడి సంధ్యారాణి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో అరకు కాఫీ షాప్‌లు పెట్టాలని, ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని జీసీసీ అధికారులను రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానస పుత్రిక అయిన అరకు కాఫీ బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంప వ్యాప్తం చేయటంలో ప్రణాళికాయుత చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం ఆమె బీచ్ రోడ్లోని జీసీసీ కార్యాలయ సమావేశ మందిరంలో ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, ఎండీ కల్పనా కుమారి, డైరెక్టర్లు నాగరాజు, కనకరాజు, నిబ్రహీం, అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. అరకు కాఫీకి ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని, దాన్ని కాపాడుకుంటూ మరింత విజయవంతంగా ముందుకు సాగాల్సి ఉందని, ప్రత్యేక కార్యాచరణతో లాభదాయక చర్యలు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. జీసీసీ ప్రాంగణంలో రూ.84 కోట్ల అంచనా వ్యయంతో 12 అంతస్తుల భవనం నిర్మించేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. చింతపల్లి ప్రాంతంలోని కాఫీ తోటల్లో దుష్ప్రభావాన్ని చూపుతున్న బెర్రీ బోరర్ పురుగు వ్యాప్తిపై ఆందోళన అవసరం లేదని మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ జీసీసీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలు, బెర్రీ బోరర్ వ్యాప్తి చెందకుండా చేపడుతున్న చర్యలను వివరించారు.

11న ఆటో డ్రైవర్ల చలో కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ: ఈనెల 11న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఆటో ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ మధు రెడ్డి కోరారు. ఎస్ ఎఫ్ స్ స్కూలు షిరిడి సాయి ఆటో స్టాండ్ వద్ద మంగళవారం కరపత్రాలతో ప్రచారం వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆన్ లైన్ యాప్‌ల వల్ల ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతిన్నదని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వాహన మిత్ర పథకాన్ని ప్రభుత్వం అమలుచేయాలని అన్నారు. చలో కలెక్టర్ ఆఫీస్ కార్యక్రమం ఉదయం 9 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రూ.కోటి 50 లక్షలతో క్రిమి టోరీయం భవన నిర్మాణం

విశాలాంధ్ర - గాజువాక : గాజువాక జోన్ 72వ వార్డు పరిధి చిన గంట్యాడ శ్మశాన వాటికలో రూ.కోటి 50 లక్షల రూపాయల నిధులతో ఎలక్ట్రికల్ క్రిమి టోరీయం భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని, భవన నిర్మాణ స్లాబ్ పనులు జరుగుతున్నాయని వార్డు కార్పొరేటర్ ఏ.జె.స్టాలిన్ తెలిపారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ క్రిమి టోరీయం ద్వారా శవాలు బూడిద అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ సూర్యా రావు, ఏ.ఈ (సివిల్) వెంకటేశ్వరరావు, సుధాకర్, సిపిఐ కార్యదర్శి జి.ఆనంద్ పాల్గొన్నారు.

జాతీయ పోషకాహార వారోత్సవాలు ముగింపు

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ పోషకాహార వారోత్సవాలు మంగళవారం ముగిసాయి. ఈ వారోత్సవాలలో భాగంగా నగరంలోని వివిధ పాఠశాలలలో గీతం ఫార్మసీ విద్యార్థులు పోషకాహారంతో కూడిన ఆహార పదార్థాలను, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోషకాహార ప్రాధాన్యతను వివరించారు. పోషకాహార లోపాల వల్ల కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోషకాహారంపై వివిధ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్.శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో అధిక శాతం మంది పోషకాహార లోపాల కారణంగా వివిధ వ్యాధులకు గురవుతున్నారని, పట్టణ ప్రాంతాలలో ఊబకాయం, మధుమేహం వంటివి పెరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జి.సౌజన్య, డాక్టర్ జి.వి.రాధ, డాక్టర్ ఎస్.స్వర్ణలత, డాక్టర్ ఆర్.బి.నలంద తదితరులు పాల్గొన్నారు. వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

మన డబ్బులు - మన లెక్కలు యాప్‌పై శిక్షణ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండల సమైక్య కార్యాలయంలో మంగళవారం "మన డబ్బులు - మన లెక్కలు" యాప్‌పై శిక్షణ జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొని, తమ లెక్కల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

డీఆర్‌డీఏ డిపిఎం వైదేహి మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా ప్రతి సంఘం తమ పొదుపులు, అప్పులు, రుణాలు, లావాదేవీలు సులభంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అంతేకాకుండా రియల్ టైమ్ రికార్డులు పొందగలుగుతారని, దీనివలన పారదర్శకత పెరిగి, సభ్యులకు భవిష్యత్తులో రుణ సదు పాయాలు పొందేందుకు సులభతరం అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కె.ఎస్తేరు రాణి, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి బతుకమ్మ సంబరాలు

విశాలాంధ్ర - గాజువాక : ఉక్కు నగరంలో ఈ నెల 22 నుంచి బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నామని ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం తెలిపింది. సంఘం సమావేశం మంగళవారం ఉక్కు నగరంలో జరిగింది. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.కుమార స్వామి, జి.ఆనంద్ మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు.

ఈ సమావేశంలో ప్రముఖ కాంట్రాక్టర్ ఏ.మురళీధర్ రెడ్డి, సంఘం ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, జి.మల్లేశం, టి.ప్రభాకర్, చంద్ర కిరణ్ పాల్గొన్నారు.

చింతలపూడిని కలిసిన వైసీపీ నేతలు

విశాలాంధ్ర - మల్కాపురం: వైసీపీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్)గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్యని ఆ పార్టీ జోనల్ ఇన్‌చార్జ్, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, విశాఖ ట్రేడ్ యూనియన్

అధ్యక్షులు రాయపురెడ్డి అనిల్ కుమార్, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ జోనల్ సెక్రటరీ బడుగు సాయిచంద్, సీనియర్ నాయకులు రమేష్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

డీఎస్సీ మెరిట్‌లో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం

మంత్రి డోలా వీరాంజనేయులు దృష్టికి దళితుల సమస్యలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: డీఎస్సీ మెరిట్ జాబితాలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ద్వారా మెరిట్ ర్యాంకులు పొందిన వారు ఎస్సీ కేటగిరీలో మాత్రమే పరిగణించబడ్డారని, దాని వల్ల తీవ్ర అన్యాయం జరిగిందని ప్రధాన కార్యదర్శి, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు, దళిత హక్కుల పోరాట సమితి జేవీ ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా వీరాంజనేయులుని కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏపీ బడ్జెట్‌లో ఆర్థిక సంవత్సరం 3 లక్షల 25 వేల కోట్లలో ప్రభుత్వం ఉప ప్రణాళిక ప్రకారం 50 వేల కోట్లు కేటాయించాలన్నారు. ఈ నిధులు ఎలా ఖర్చు చేస్తున్నారో మాకు తెలియడం లేదన్నారు. రాష్ట్రంలో 130 కోట్లు వస్తుందని, దరఖాస్తుదారులు ప్రతి జిల్లాకు 20000 కంటే ఎక్కువ వస్తున్నాయన్నారు. గత 4 సంవత్సరాలుగా ఎన్ఎస్ఎఫ్ బిసి రుణాలు లేవని, రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చొరవ తీసుకోవడం లేదన్నారు. ఒక్క ఎకరం భూమి కూడా కొనుగోలు చేసి పంపిణీ చేయలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దళితులకే కేటాయించాలని,అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయాలని కోరారు.దీనికి సంబంధించిన కార్యక్రమాన్ని ప్రారంభించాలని అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ తరుపున కోరుతున్నామన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలంటూ 11న చలో కలెక్టరేట్

ఏఐటియుసీ ప్రదాన కార్యదర్శి పడాల గోవింద్

విశాలాంధ్ర - పెందుర్తి: ఇప్పటికే దినదిన గండం నూరేళ్ళ ఆయుషులా బతుకుతున్న ఆటో మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లపై ప్రభుత్వ ఉచిత బస్సు పథకం మూలిగే నక్కపై తాటిపండు పడినట్లుగా తయారైందని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ పేర్కొన్నారు.

మంగళవారం ఉదయం పెందుర్తి జంక్షన్‌లో జరిగిన ఆటో డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆదాయం కోల్పోయిన ఆటో డ్రైవర్లను తక్షణమే ఆదుకోవాలని, ఓలా, ఉబర్, రాపిడ్ ఆన్లైన్ యాప్‌లు నుండి టూ వీలర్లను వెంటనే తొలగించాలని, ఆటో అండ్ మోటార్ డ్రైవర్లకు వాహన మిత్ర పథకం 15 వేల రూపాయలు వెంటనే బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. ఈనెల 11న జీవిఎంసీ గాంధీ విగ్రహం నుండి, కలెక్టర్ కార్యాలయం వరకు ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి జోన్ ఆటో కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులు బోరా పైడిరాజు, గొలగాని మురళి, చందవరపు వేణు, నక్క సాదు. బంధం నాగదేవుడు, పల్లా అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ముడసలోవ రిజర్వాయర్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. అడవివరం నుంచి వస్తున్న వ్యానును ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో శ్రీ కృష్ణాపురం నివాసి గుడ్ల గోవిందరాజు (34), మరో యువకుడు హరీశ్ మృత్యువాత పడినట్లు ఆరిలోవ ఎస్ఐ వై.కృష్ణ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించామన్నారు.

గుర్తింపు కార్డుల పంపిణీ

విశాలాంధ్ర - పెదగంట్యాడ : సిపిఐ పార్టీకి అనుబంధంగా ఉన్న లంబోదర శ్రీ శక్తి టిడ్కో(పెదగంట్యాడ) మహిళా సంఘం మహిళలకు మంగళవారం గుర్తింపు కార్డులను జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లీ గోవింద్ అందజేసారు. మహిళా సంఘం మహిళలు డిప్యూటీ మేయర్ దల్లీ గోవింద్‌కు పుష్ప గుచ్చం అందజేశారు. మేయర్ దల్లీ గోవింద్ మాట్లాడుతూ మహిళలు ఐక్యంగా తమ సమస్యలపై పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జి.ఆనంద్, పెద పూడి దుర్గా రావు, లంబోదర శ్రీ శక్తి టిడ్కో పెద గంట్యాడ మహిళా సంఘం అధ్యక్ష ,కార్యదర్శులు రమణి, పీత లక్ష్మీ, ప్రమీల, టిడ్కో గృహ లబ్ది దారుల సంఘం ప్రతినిధులు పి.అప్పల రాజు, భాస్కర్ రావు పాల్గొన్నారు.

అనంతపద్మనాభునికి వాటర్ ఫిల్టర్ బహుకరణ

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ అనంత పద్మనాభ స్వామి వారి దేవస్థానంకు మద్ది గ్రామానికి చెందిన సిఎస్‌బి బ్యాంక్ మేనేజర్ జయకృష్ణ తన సొంత నిధులతో మంచినీటి వాటర్ ఫిల్టర్‌ను సమకూర్చడం జరిగింది. స్థానిక ఎంపీపీ కే.రాంబాబు చేతుల మీదగా దీన్ని స్వామివారికి అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ డాక్టర్స్ అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీగా డా. అన్వేషి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ డాక్టర్స్ అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీగా విశాఖ కింగ్ జార్జ్ హాస్పిటల్ యువ వైద్యురాలు డాక్టర్ అన్వేషి ఎంపికయ్యారు. నేషనల్ ఎస్సి, ఎస్టి, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఆర్.కృష్ణయ్య స్థాపించి గత 50 ఏళ్లుగా నడిపిస్తున్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య చేతులు మీదుగా ఈ ఎంపిక పత్రాన్ని డా కె.అన్వేషి పొందారు. ఈ సందర్భంగా జాతీయ కమిటీ సభ్యులు ఆర్ రమేష్, పరిపూర్ణ చారి, వెలమాటి సురేష్ తదితరులు డాక్టర్ అన్వేషికి శుభాకాంక్షలు తెలియచేసారు.

ప్రధాన జంక్షన్లు, రోడ్లను పచ్చదనంతో తీర్చిదిద్దండి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలో త్వరలో జరుగనున్న ప్రధాన సమ్మిట్లు, ఐఎఫ్ఆర్ కార్యక్రమాలకు విశాఖ నగరం వేదిక కానున్నందున నగరాన్ని పచ్చదనంతో అందంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ అధికారులను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. మంగళవారం ఆయన జీవీఎంసీ 2వ జోన్ 8వ వార్డు పరిధిలోని ఋషికొండ, టీటీడి దేవాలయం వరకు ఉన్న సెంటర్ మీడియన్, రోడ్లను, ఫుట్పాతులను ఏపీజీబీసీ - ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ జోనల్ మేనేజర్ నాగేంద్ర, జీవీఎంసీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఎం.దామోదర్‌రావు, ఆర్కిటెక్ట్ సత్య తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో పలు సమ్మిట్లు, ఐఎఫ్ఆర్ తదితర కార్యక్రమాలు త్వరలో జరుగనున్న నేపథ్యంలో ప్రధాన జంక్షన్‌లను, రోడ్లను, సెంటర్ మీడియన్లను పచ్చదనంతో అందంగా తీర్చిదిద్దే కార్యక్రమాలు చేపట్టాలని డిడిహెచ్ దామోదర్‌ను ఆదేశించారు. నగరంలో రెండు రోజులు సంయుక్తంగా ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించి అవసరమగు ప్రణాళికలు సిద్ధం చేసి వారం రోజులలో నివేదికను సమర్పించాలని ఏపీజీబీసీ - ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ జోనల్ మేనేజర్ నాగేంద్ర, జీవీఎంసీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ ఎం.దామోదర్‌రావు, ఆర్కిటెక్ట్ సత్యలకు కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ఏఎంఓహెచ్ డాక్టర్ ఎన్.కిషోర్, శానిటరీ ఇన్స్పెక్టర్ రవి, హార్టికల్చర్ ఆఫీసర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సినర్జీస్ కార్మికుల ఆకలి బాధలపై ప్రభుత్వం స్పందించాలి

విశాలాంధ్ర - గాజువాక: ఉద్దేశపూర్వకంగా జీతాలు ఎగవేసిన సినర్జీస్ యాజమాన్యాన్ని కంపెనీల చట్టం కింద ప్రాసిక్యూట్ చేసి తక్షణమే జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు డాక్టర్ బూసి వెంకటరావు డిమాండు చేసారు. 5వ రోజుకు చేరిన సినర్జీస్ కార్మికుల పోరాటానికి సంఘీభావంగా ఏఐటీయూసీ ప్రతినిధులు ఈ రోజు సమ్మె శిబిరాన్ని సందర్శించారు. సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి వెంకటరావు మాట్లాడుతూ ఆరు నెలలుగా కార్మికులు పస్తులుండి రక్తాన్ని దారపోసి యంత్రాలు నడుపుతుంటే యాజమాన్యం లాభాలు భోంచేస్తూ ఉద్యోగుల జీతాలు మాత్రం చెల్లించక పోవడం దుర్మార్గం అన్నారు. యజమాని ఉద్దేశపూర్వకంగా జీతాలు చెల్లించక పోతే 2013 కార్పోరేట్ చట్టం సెక్షన్ 447 కింద మోస పూరితమైన నేరానికి పాల్పడినట్టేనని దీనిపై లేబర్, ఎస్ఇజెడ్ అధికారులు చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండు చేసారు. వారం రోజులుగా సినర్జీస్ ఉద్యోగుల ఆకలి కేకలు కూటమి చెవికి చేరలేదా లేక పాలకులు యజమాని కొమ్ము కాస్తున్నారా అని ప్రశ్నించారు. బకాయి పడ్డ వేతనాలు తక్షణం చెల్లించక పోతే యూనియన్ అనుబంధంతో సంబంధం లేకుండా జిల్లాలోని అన్ని సంఘాలు సినర్జీ గేటు ముందుకు వస్తాయని, యజమాని న్యాయ పరమైన చర్యలు కూడా ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు.

ఈ నేరం ఎవరిది..?

రైల్వే ఆసుపత్రి నిర్లక్ష్యం... గాలిలో కలిసిన ప్రాణం



విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: వైద్యో నారాయణో హరి అనేది నానుడి ఇది సమాజంలో వైద్యుల ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. కానీ కొందరు వైద్యులు దాన్ని నిలబెట్టుకోవడం లేదు. నిర్లక్ష్య ధోరణితో రోగుల ప్రాణాల మీదకు తెస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసిన వారికి జిల్లాలో చిన్న ఆస్పత్రులు ఉంటాయి. రైల్వే శాఖకు జిల్లాలో 20 వరకు రిఫరల్ ఆసుపత్రులు ఉన్నాయి. రిఫరల్ ఆస్పత్రిలో చేరిన వారికి సంబంధిత శాఖకు చెందిన వైద్య అధికారులు తగిన రీతిలో స్పందించకపోవడంతో రోగుల ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రధానంగా రైల్వే ఆసుపత్రిలో వైద్యాధికారులు నిర్వాకం రోగుల పాలిట శాపంగా మారింది. మనిషి ప్రాణాలకు తగిన విలువ ఇవ్వకపోవడంతో వారి ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఇటీవల జరిగిన ఓ సంఘటన ప్రస్తుతం చర్చనీయాంశమైంది. రైల్వేలో సూపరింటెండెంట్ (గెజిటెడ్)గా పనిచేసి పదవీ విరమణ పొందిన అధికారి గత కొంతకాలంగా హృద్రోగ సమస్యతో బాధపడుతున్నారు. ఇటీవల ప్రమాదకర పరిస్థితుల్లో ఆయన రైల్వే రిఫరల్ హాస్పిటల్‌లో చేరారు. కేజీహెచ్ డౌన్‌లో ఉన్న ఆసుపత్రి వర్గాలు రైల్వే ఆస్పత్రి నుంచి అనుమతి పొందిన లేఖ తెమ్మన్నారు. ఈ అనుమతి లేఖ ఇవ్వడానికి రైల్వే వర్గాలకు మూడు రోజులు పట్టింది. టెక్నాలజీ అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో ఆన్లైన్లో సమాచారం ఇవ్వాల్సి ఉండగా వారి లెటర్ హెడ్ మీద రాసి డివిజనల్ మెడికల్ అధికారి, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్‌లకు పంపించారు. వీరు ఇరువురు కలసి చర్చించుకుని ఇవ్వాలా వద్దా అని సమాలోచనలు చేసి అనుమతి ఇచ్చేసరికి మూడు రోజులు పట్టింది. ఆ లేఖ తీసుకెళ్లి రిఫరల్ ఆస్పత్రికి ఇవ్వగా వారు మళ్ళీ గుండె శస్త్రచికిత్సకి అయ్యే ఖర్చులు రాసి పంపించే అనుమతి కోరారు. దీనికి మరో రెండు రోజులు పట్టింది. ఈలోగా ఆ ఆసుపత్రిలోని అధికారి పరిస్థితి విషమించడంతో వారి కుటుంబ సభ్యులు నేరుగా డబ్బులు చెల్లించి ఆపరేషన్‌కు సిద్ధమయ్యారు. ఆపరేషన్ సమయంలోనే ఆయన ప్రాణాలు విడిచారు. ఆసుపత్రిలో చేరిన ఒకటి రెండు రోజుల్లోనే శస్త్రచికిత్స జరిగి ఉంటే ఆయన ప్రాణాలు నిలిచేవని రిఫరల్ ఆసుపత్రి వైద్యులు, బంధువులు అన్నారు. రైల్వే ఆసుపత్రి వైద్యాధికారులు నిర్వాకం వల్లే రోగి ప్రాణాలు కోల్పోయారని వారి సన్నిహితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ఎవరికి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తర్లువాడలో ప్రకృతి వ్యవసాయ మోడల్స్ పరిశీలన

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ మోడల్స్‌ను చూడటానికి ఉత్తరప్రదేశ్‌కు చెందిన రైతులు, అలాగే నేషనల్ రిసోర్సెస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు పి.తరుణ్ ఆదిత్య, శ్రీను గ్రామాన్ని సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా కాంపాక్ట్ బ్లాక్‌లో సాగు చేస్తున్న వివిధ పద్ధతులను పరిశీలించారు. మోడల్ మేకర్ రామారావు ఏ-గ్రేడ్ మోడల్‌లో వేర్వేరు పంటలు, వాటి ద్వారా లభించే ఆదాయం గురించి వివరించారు. ఎన్ఎఫ్ఏ- హెచ్ఆర్ బి.శ్రీనివాస చక్రవర్తి పొలంలో సాగు చేస్తున్న ఏటీఎం మోడల్ ను పరిశీలించిన రైతులు, ఈ విధానంలో ఎదురయ్యే సమస్యలు, లాభాలపై ఆయనతో చర్చించారు. ఈ కార్యక్రమానికి తర్లువాడ యూనిట్ ఇన్‌చార్జ్ రెల్లి పైడిరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు హాజరయ్యారు.

ఐడియాతో రండి.. పారిశ్రామికవేత్తగా వెళ్లండి

- దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలే కీలకం
- నూతన పారిశ్రామికవేత్తలుగా యుతను తీర్చిదిద్దడమే 'గేమ్' లక్ష్యం
- 2030 నాటికి 50 మిలియన్ల కొత్త ఉద్యోగాల సృష్టే లక్ష్యం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలే కీలకమని, యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతోనే గ్లోబల్ అలయన్స్ ఫర్ మాస్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(గేమ్) పనిచేస్తోందని గేమ్ సహ వ్యవస్థాపకుడు పి.మధన్ పేర్కొన్నారు. మంగళవారం ది డెక్ భవనంలో ఉన్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్‌టీఐహెచ్)లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో మాస్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఉద్యమాన్ని వేగవంతం చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా నగరంలోనే కాకుండా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో కూడా యువత, మహిళలను సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించడానికి గేమ్ ఒక వేదికగా నిలుస్తోందన్నారు. 2030 నాటికి 50 మిలియన్ల కొత్త ఉద్యోగాల సృష్టే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధికి సరైన ఆలోచన, స్థానిక పరిస్థితుల సహకారం, సులభతరమైన ప్రభుత్వ పాలసీలు, విధానాలు కీలకమని వివరించారు. వీటన్నింటిపై దేశంలో అనేక రాష్ట్రాల్లో గేమ్ పనిచేస్తూ నూతన పారిశ్రామికవేత్తలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. అన్ని రంగాల పారిశ్రామికవేత్తలను ఒక తాటిపైకి తీసుకొచ్చి వారి ద్వారా ఔత్సాహికులకు పారిశ్రామిక, వ్యాపార మెళకువలు, మార్కెటింగ్, టెక్నాలజీ ఇలా అన్నింట్లోను ఉచితంగా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే నాగాలాండ్, నాగ్‌పూర్‌లో ఈ ప్రోగ్రాంను ప్రారంభించామని, ఆంధ్రప్రదేశ్‌లో విశాఖలోనే డిస్ట్రిక్ట్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ మిషన్‌ను ప్రారంభించామన్నారు. ఏ-హబ్ సీఈఓ రవి ఈశ్వరపు మాట్లాడుతూ ఆర్‌టీఐహెచ్ ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు.. ఇలా ఆరు జిల్లాల్లో యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. కన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షురాలు యార్లగడ్డ గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ ఔత్సాహికులు ఎవరైనా ఒక ఐడియాతో గేమ్‌కు వస్తే.. ఒక పారిశ్రామికవేత్తగా బ్రాండింగ్‌తో వెళ్లేంత వరకు గేమ్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో నేటివ్ అరకు కాఫీ అధినేత రామ్‌కుమార్ వర్మ, గేమ్ ప్రతినిధి కేతుల్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాదిపదికన గెడ్డల్లో వ్యర్థాలను తొలగించండి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలో వర్షాలు పడుతున్నందున గెడ్డల్లో, కాలువలలో వ్యర్థాలు పేరుకుపోయి అడ్డంకులు ఏర్పడుతున్నందున యుద్ధ ప్రాదిపదికన వ్యర్థాలను తొలగించి తరలించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జీవీఎంసీ 3వ జోన్ 16వ వార్డులలోని ఇసుకతోట వద్ద కృష్ణ మందిరానికి ఆనుకుని ఉన్న ప్రధాన గెడ్డను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వర్షాలు అధికంగా కురుస్తున్న ందున గెడ్డలలో వ్యర్థాలు పేరుకుపోయి అడ్డంకులు ఏర్పడుతు న్నాయని వెంటనే నియంత్రణా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గెడ్డల్లో వ్యర్థాలు పేరుకుపోయి అడ్డంకులు ఏర్పడకుండా స్టీల్ మెస్సును వారం రోజుల్లో ఏర్పాటు చేయాలని పర్యవేక్షక ఇంజనీర్ పల్లమరాజుకు కమిషనర్ ఆదేశించారు. అనంతరం అపోలో ఫార్మసీ సమీపంలో గ్రీన్ బెల్ట్‌లో వ్యర్థాలు ఎక్కువగా పేరుకుపోయి ఉన్నందున హార్టికల్చర్ ఆఫీసర్ వాసుకిని ఆరా తీస్తూ నిత్యం గ్రీన్ బెల్ట్‌లు, సెంటర్ మీడియన్‌లు పరిశు భ్రంగా పచ్చదనంతో నిండి ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కార్యనిర్వాహక ఇంజనీరు మురళీకృష్ణ, గంగాధర్, సుధాకర్, ఏఎంఓహెచ్ బి.ప్రసాద్‌రావు, హార్టికల్చర్ ఆఫీసర్ వాసుకి, సహాయక ఇంజనీరు రహీం తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధిపై దృష్టిసారించండి: జీవీఎంసీ కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ 4వ జోనల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జీవీఎంసీ 4వ జోన్ జోనల్ కార్యాలయంలో 4వ జోనల్ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ అధికారులు విధుల పట్ల అంకిత భావంతో నిర్లక్ష్యం వహించకుండా విధులు నిర్వహించాలని, నగరాభివృద్ధిపై,జీవీఎంసీ ఆర్థిక పరిపుష్టిపై దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. 4వ జోన్ పరిధిలో ఎన్ని అభివృద్ధి పనులు మంజూరయ్యాయని, పనులు ఏ ఏ స్థాయిలో ఉన్నాయని ఇంజనీరింగ్ అధికారులను ఆరా తీశారు. మంజూరైన పనులు నిర్ణీత సమయంలో సంబంధిత కాంట్రాక్టర్‌చే ఆరంభించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జోన్ పరిధిలో ఎన్ని అనధికార కట్టడాలు గుర్తించారని వాటిపై తీసుకున్న చర్యలపై ఆరా తీస్తూ అనధికార నిర్మాణాలు ఉంటే వాటికి ఆక్యుపెన్సి సర్టిఫికేట్ జారీ చేయరాదని, అలా కాకుండా నిర్లక్ష్యం వహించి ఆక్యుపెన్సి సర్టిఫికేట్ జారీ చేసే అధికారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఆస్తి పన్ను, నీటి చార్జీలు, అద్దెలు, ఆశీలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆస్తి పన్నులు మొదలైనవి శత శాతం వసూలు చేయాలని రెవిన్యూ అధికారులను కమిషనర్ ఆదేశించారు. రాత్రి పారిశుధ్య పనుల నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలని కమిషనర్ ప్రజా ఆరోగ్య అధికారులకు ఆదేశించారు. జోనల్ పరిధిలో వ్యర్థాలు అధికంగా ఉండే ప్రదేశాలను గుర్తించి వ్యర్థాలు పడవేయకుండా ప్రజల్లో అవగాహన పెంపొందించి, ఇంటింటికి వచ్చే క్లాప్ వాహనానికి వ్యర్థాలు ప్రజలు అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమీక్షలో కార్యనిర్వాహక ఇంజనీర్లు శ్రీధర్, మురళీకృష్ణ, నర్సింగరావు, ఏఎంఓహెచ్ డాక్టర్ కృష్ణంరాజు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు వెంకటేశ్వరరావు, శ్రీరామ్మూర్తి, అన్నమ నాయుడు, అసిస్టెంట్ ఇంజనీర్ విల్సన్, వార్డు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు

నేడు జీవీపీలో అమరావతి క్వాంటం వ్యాలీ హాకథాన్

విశాలాంధ్ర - విశాఖపట్నం: క్వాంటం టెక్నాలజీల అభివృద్ధి చెందుతున్న రంగాలలో ఆవిష్కరణలు మరియు పరిశోధనలను ముందుకు తీసుకెళ్లడానికి రూపొందించిన అగ్రగామి కార్యక్రమం అమరావతి క్వాంటం వ్యాలీను కొమ్మాదిలోని గాయత్రీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.బాల కోటేశ్వరరావు, డేటా సైన్స్ డాక్టర్ వై.అనురాధ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆ కళాశాలలో జరిగిన హాకథాన్ పోస్టర్ ఆవిష్కారం కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మక హాకథాన్ క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం కమ్యూనికేషన్ మరియు అనుబంధ రంగాలలో యువ మేధావులను ప్రేరేపించడానికి విద్యా శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా ప్రారంభమైందని చెప్పారు. అమరావతి క్వాంటం వ్యాలీ హాకథాన్ పోటీల రీజనల్ రౌండ్ విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకి చెందిన విద్యార్థులు కోసం రీజినల్ సెంటర్‌గా తమ గాయత్రీ కళాశాలను ఎంపిక చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మొత్తం 35 జట్లు ఈ మూడు తీర జిల్లాల నుండి పాల్గొంటూ, ఏపీఎస్‌సిహెచ్‌ఈ అందించిన 10 సమస్యా ప్రకటనల పై పనిచేస్తాయన్నారు. ఈ పోటీలలో ప్రతి సమస్యకు ఒక విజేత, ఒక రన్నరప్ చొప్పున 10 మంది విజేతలు, 10 మంది రన్నరప్‌లు ఎంపిక చేయబడతారన్నారు. ఈ హాకథాన్ ఆరంభోత్సవానికి ఆంధ్ర విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.పి.రాజశేఖర్ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారన్నారు. ఈ సెమీఫైనల్ రౌండ్ కోసం మొత్తం రూ.1,50,000/- విలువైన బహుమతులు ప్రకటించబడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రి ఇంజనీరింగ్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నర్సుల నేతృత్వంలోని క్లినిక్‌ను ప్రారంభించిన అపోలో హాస్పిటల్స్

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా నర్సుల నేతృత్వంలోని క్లినిక్‌ను అపోలో హాస్పిటల్స్, విశాఖపట్నం ప్రారంభించింది. ఇది రోగికి మెరుగైన సంరక్షణ, మద్దతును అందించటంలో ఒక ప్రధాన పురోగతిని సూచిస్తుంది. ఈ క్లినిక్ రోగులు , వారి కుటుంబ సభ్యులకు అనుసంధాన కేంద్రంగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకుంది. రోగులకు చికిత్స మరియు వారు కోలుకునే ప్రక్రియ అంతటా స్పష్టమైన మార్గదర్శకత్వం, ఆరోగ్య విద్య, వ్యక్తిగతీకరించిన సంరక్షణను

అందిస్తోంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అపోలో హాస్పిటల్స్ డివిజన్ ప్రెసిడెంట్ డాక్టర్ మధు శశిధర్‌తో పాటుగా ఆసుపత్రి నాయకత్వ బృందంలోని సీనియర్ సభ్యులు రామచంద్ర, డాక్టర్ కృష్ణ ప్రసాద్ (చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్లు), డాక్టర్ బాలకృష్ణ (మెడికల్ సూపరింటెండెంట్), రాఘువేణి (చీఫ్ నర్సింగ్ ఆఫీసర్), తిరుమల , స్వాతి (నర్సింగ్ ఎడ్యుకేషన్), ప్రియాంక (క్వాలిటీ నర్స్), విక్రమ్ (క్వాలిటీ హెడ్) హాజరయ్యారు. అపోలో హాస్పిటల్స్‌లోని నర్సింగ్ గ్రూప్ డైరెక్టర్ కెప్టెన్ (డాక్టర్) ఉషా బెనర్జీ మార్గదర్శకత్వంలో అభివృద్ధి చేశారు. శిక్షణ పొందిన నర్సింగ్ నిపుణులు వైద్యులతో చేయి చేయి కలిపి పనిచేయడానికి ఈ క్లినిక్ వీలు కల్పిస్తుంది, అదే సమయంలో రోగులకు అవసరమైన భరోసా, మద్దతును కూడా అందిస్తుంది.

కోటక్ కన్య స్కాలర్‌షిప్‌ను ప్రకటించిన కోటక్ మహీంద్రా

విశాలాంధ్ర - విశాఖపట్నం: కోటక్ మహీంద్రా గ్రూప్ యొక్క సీఎస్ఆర్ కార్యక్రమాల అమలు విభాగం కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (కెఈఎఫ్), తమ కోటక్ కన్య స్కాలర్‌షిప్ కార్యక్రమం కింద 500 స్కాలర్‌షిప్‌లను అందించనున్నట్లు వెల్లడించింది. భారతదేశ వ్యాప్తంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన బాలికలు తమ ఉన్నత విద్య కలలను సాకారం చేసుకోవటానికి చేయూత నందించే ఈ కార్యక్రమం, ఇప్పుడు తమ ఐదవ సంవత్సరాన్ని వేడుక చేసుకుంటుంది. "కలలు కనండి. దాన్ని వెంబడించండి. స్వంతం చేసుకోండి" అనే స్ఫూర్తిదాయకమైన నినాదంతో ప్రారంభమైన కోటక్ కన్య స్కాలర్‌షిప్, విద్యలో లింగ అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో తీర్చిదిద్దబడిన ఒక పరివర్తనాత్మక కార్యక్రమం. ఇది భారతదేశంలోని అగ్రశ్రేణి ఎన్ఆర్ఐఎఫ్ మరియు నాక్ గుర్తింపు పొందిన సంస్థలలో స్టెమ్, మెడిసిన్, లా, ఆర్కిటెక్చర్, డిజైన్ , ఇతర రంగాలలో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను అభ్యసించే బాలికలకు మద్దతు ఇస్తుంది. 4-5 సంవత్సరాల పాటు సంవత్సరానికి ఒక్కో స్కాలర్‌కు రూ. 1,50,000 అందించబడుతుందని కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ హెడ్ మరియు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలు (ఈసి) అరతి కౌల్గుడ్ తెలిపారు.

షారుఖ్ ఖాన్, జగపతి బాబులతో థమ్స్ అప్ కొత్త ప్రచార కార్యక్రమం

విశాలాంధ్ర - విశాఖపట్నం: కోకా కోలా ఇండియా ఐకానిక్ బిలియన్ డాలర్ల బ్రాండ్ థమ్స్ అప్, ఈరోజు బాలీవుడ్ సూపర్ స్టార్ షారుఖ్ ఖాన్, తెలుగు సినిమా లెజెండ్ జగపతి బాబు నటించిన "బిర్యానీ ఏక్ నహీ, దో హాత్ సే ఖాతే హై" అనే తాజా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ప్రచారం పరిపూర్ణ బిర్యానీ అనుభవానికి ఒక గుర్తు అని కోకాకోలా ఇండియా స్పార్క్లింగ్ ఫ్లేవర్స్ కేటగిరీ హెడ్ సుమేలి ఛటర్జీ అన్నారు. గత మూడేళ్లుగా, ఈ బ్రాండ్ థమ్స్ అప్ తో బిర్యానీని ఆస్వాదించే సూక్ష్మ నైపుణ్యాన్ని తీసుకొని దానిని ఒక ప్రసిద్ధ ఆచారంగా మార్చిందన్నారు.ప్రఖ్యాత చిత్రనిర్మాత కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించిన ఈ టీవీసీ, షారుఖ్ ఖాన్, జగపతి బాబు మధ్య ఘర్షణ జరిగే అవకాశం ఉన్న పరిస్థితి ప్రారంభమవుతుందని, ఇది బిర్యానీ, థమ్స్ అప్ వచ్చినప్పుడు తూఫానీ అనుభవంగా మారుతుందన్నారు.

శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ విస్తరణ

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశపు అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్, తన ప్రధాన సీఎస్ఆర్ కార్యక్రమం 'శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్' (ఎస్ ఐ సీ) విస్తరణను ప్రకటించింది. డిజిటల్ ఇండియా మరియు స్కిల్ ఇండియా ప్రభుత్వ దృష్టికి మద్దతుగా, భారత యువతను భవిష్యత్‌కు సిద్ధమైన నైపుణ్యాలతో శక్తివంతం చేయాలనే తన నిబద్ధతను ఈ విస్తరణ మరల రుజువు చేస్తోంది. ఈ శిక్షణ కార్యక్రమం 2024లో నాలుగు రాష్ట్రాలలో ప్రారంభమై, ఈ సంవత్సరం 10 రాష్ట్రాలకు విస్తరించబడుతోంది. 2025 నాటికి 20,000 మంది విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ , బిగ్ డేటా, కోడింగ్ మరియు ప్రోగ్రామింగ్ వంటి భవిష్యత్ టెక్ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వబడుతుంది. ఇది గత సంవత్సరం 3,500 మంది విద్యార్థులకు ఇచ్చిన శిక్షణతో పోలిస్తే ఆరు రెట్లు ఎక్కువ. సాంకేతిక శిక్షణతో పాటు, విద్యార్థులు కార్యాలయ సంసిద్ధతను పెంపొందించడానికి అవసరమైన సాఫ్ట్ స్కిల్స్‌లో మార్గదర్శకత్వం పొందుతారు. అదనంగా, అర్హత కలిగిన అభ్యర్థులకు సంబంధిత పరిశ్రమల్లో ప్లేస్మెంట్ సహాయాన్ని కూడా అందించనున్నటు శామ్‌సంగ్ నైరుతి విభాగ డైరెక్టర్ జె.బి. పార్క్ తెలిపారు

ఆకట్టుకున్న విలేకరుల శిక్షణా తరగతుల ఏర్పాట్లు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాలాంధ్ర పట్టణ, గ్రామీణ విలేకరుల నైపుణ్యాన్ని పెంచే క్రమంలో జరిగిన ఏర్పాట్లు అతిథులను, ప్రతినిధులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆంధ్ర యూనివర్సిటీ క్యాంపస్‌లోని జూబ్లీ హాల్‌లో మూడు రోజులపాటు జరగనున్న జర్నలిస్టుల శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. వైజాగ్ ఎడిషన్ పరిధిలో ఆరు జిల్లాల విలేకరులు 70 మంది పైగా పాల్గొన్నారు. అందులో భాగంగా సమావేశ మందిరం వద్ద స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. భీమిలి నియోజకవర్గం బాధ్యులు నాగరాజు అల్పాహారం ఏర్పాటు చేశారు. విశాఖ ఎడిషన్ మేనేజర్ నరసింహులు, విశాఖ జిల్లా బ్యూరో పి.రామకృష్ణలు భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి నాగరాజును అభినందించారు.

మైనర్ బాలికపై లైంగిక దాడిలో దోషులకు శిక్ష తప్పదు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఈనెల 7వ తేదీన సీతమ్మధార శివారు కొండపైన 11 సంవత్సరముల మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి అత్యంత దురదృష్టకరమని, దోషులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. మంగళవారం ఉదయం కింగ్ జార్జ్ ఆసుపత్రి (కెజిహెచ్) ఆవరణలోని వన్ స్టాప్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న మైనర్ బాలికను పరామర్శించి, బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి దోషులను కఠినంగా శిక్షించడంతోపాటు ప్రభుత్వపరంగా బాలికను ప్రత్యేక స్కూల్లో చదివించడంతోపాటు, అన్ని విధాల ఆదుకోవడం జరుగుతుందని భరోసా కల్పించారు. అనంతరం రాయపాటి శైలజ మాట్లాడుతూ మైనర్ బాలికపై లైంగిక దాడులకు పాల్పడిన ఇద్దరూ మైనర్ బాలురేనని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు సెల్ ఫోన్లు ఇవ్వడం వల్ల కొందరు పిల్లలు మంచి కంటే చెడుకే ఎక్కువగా ఉపయోగించడం వల్ల ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు.

క్రీడాకారులకు సత్కారం

విశాలాంధ్ర - పెందుర్తి: ఎంఎంఏ నేషనల్ ఛాంపియన్స్‌లో సత్తా చాటిన పెందుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు క్రీడాకారులను జీవిఎంసీ 95వ వార్డు కార్పొరేటర్, బిజెపీ నాయుకుడు ముమ్మన దేముడు మంగళవారం ఘనంగా సత్కరించారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన ఎంఎంఏ నేషనల్ చాంపియన్స్ షిప్ మెడలిస్ట్ కాంపిటేషన్లో విశాఖపట్నం సుజాతనగర్ ఎఫ్‌సి అకాడమీ నుంచి విజేతలుగా నిలిచిన గొర్లె మోహన్ (గోల్డ్ మెడలిస్ట్), కొడమంచిలి దిలీప్ (సిల్వర్ మెడలిస్ట్), గంగు కుమారస్వామి (బ్రాంజ్ మెడలిస్ట్), కుంచాల వెంకట కార్తిక్ (బ్రాంజ్ మెడలిస్ట్),లను కార్పొరేటర్ ముమ్మన దేముడు తన క్యాంప్ కార్యాలయంలో శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి 95,97వ వార్డుల అధ్యక్షులు చిక్కాల సతీష్, సోషల్ మీడియా కన్వీనర్ కంచిబోయిన వెంకట సంతోష్, సెక్రటరీ కొత్తపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.553 కోట్లతో భూగర్భ డ్రైనేజీకి ఐఎఫ్‌సీతో ఒప్పందం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ నగర అభివృద్ధిపై సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ పెట్టారని విశాఖ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. రూ.553 కోట్లతో జీవీఎంసీ జోన్ 2లో భూగర్భ డ్రైనేజ్‌కి ఐఎఫ్‌సీతో ఒప్పందం శుభపరిణామం అన్నారు. దీంతో దేశంలోనే తొలిసారి ఐఎఫ్ సీ రుణం పొందిన తొలి కార్పొరేషన్ గా జీవీఎంసీ చరిత్రకెక్కిందన్నారు. ఈ ఒప్పందం ద్వారా దేశంలో నగరాల ఆర్థిక స్వయం ప్రతిపత్తికి సీఎం చంద్రబాబు నాయుడు నూతన ఒరబడి తీసుకొచ్చారన్నారు. ఈ ప్రాజెక్టుతో జీవీఎంసీ జోన్ 2లో 100 శాతం అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, మోడల్ పంపింగ్, లిఫ్టింగ్ స్టేషన్లు, అత్యాధునిక శుద్ధి కేంద్రం, నీటి పునర్వినియోగం, రీసైక్లింగ్‌తో విశాఖ ప్రజలకు ఎంతో ఉపయోగమన్నారు.

యూరియా సరఫరాపై వైసీపీ కుట్రలకు అడ్డుకట్ట వేయాలి

విశాలాంధ్ర - పెందుర్తి: అనకాపల్లి జిల్లాలో యూరియా కొరత లేదంటూ వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు ప్రకటనలు చేస్తున్నప్పటికీ, వైసిపి నాయకులు వక్రబుద్ధితో అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు స్పష్టం చేసారు. వైసీపీ నాయకులు తమ పార్టీ మనుగడ కోసమే రోడ్డు ఎక్కుతున్నారని మండిపడ్డారు. ఎరువుల కొరతలేదని, పశుగ్రాసం పెంచే రైతులు యూరియా ఎక్కువుగా వాడడంతో వచ్చిన నిలువలు వెంట వెంటనే అయిపోతున్నాయని, ఈ విషయాన్ని వ్యవసాయ అధికారులు స్పష్టం చేస్తున్నప్పటికీ వైసిపి నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని వేగి పరమేశ్వరరావు విమర్శించారు. అనకాపల్లి జిల్లాలో 852 టన్నుల యూరియా నిలవలు ఉన్నాయని, రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్ లతో పాటు డీలర్లు ఎరువులు విక్రయిస్తున్నారన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ రాజకీయ లబ్ధి పొందాలని ధర్నాకి పిలుపు ఇచ్చి మా వల్లే 1500 టన్నులు యూరియా వచ్చిందని చెప్పుకోవడానికి చౌకుబారు రాజకీయాలు చేస్తున్నారని పరమేశ్వర్రావు దుయ్యబట్టారు.